# ఎవరు బాధ్యులు



ధవరావు పబ్లిక్ వర్క్సుడిపార్టుమెంటులో సబ్ఓవర్సీరుగా పని చేస్తున్నాడు. జీతం నెలకి నూరు రూపాయిలే కాని, నూరు నూటఏభైదాకా పైరాబడి వుంది. అదిగాక పొలాలమీద నుంచి సాలీనా వెయ్యిరూపాయలు వస్తాయి. చీకూ చింతా లేని సంసారము. క్రొత్తగా రాధ కాపురానికి వచ్చింది. చిలకా గోరింకల్లాగు వాళ్లు సంసారం సాగిస్తున్నారు. రాధకిమాత్రం భర్త నెలకి ఇరవైరోజులు సర్క్యూటు వెళ్లుతాడని చిరాకుగా ఉండేది. గవర్నమెంటు ఉద్యోగాలలో వున్న ప్రతీవాళ్లకీ తాలుకుదారీ మొదలు దఫేదారీవరకు సర్క్యూటు తప్పదని రాధని మాధవరావు సమాధానపరుస్తూంటాడు.


విశాలంగా వుండాలని మాధవరావు మేడఇల్లు అద్దెకు తీసుకున్నాడు. రాధ వచ్చి చూచి, మీరు సర్క్యూటు వెళ్లితే నేను ఒక్కదానిని ఇంత ఇంటిలో వుండలేనండీ అని అనుటచే, తన కచేరీలోనే గుమస్తాగా పనిచేస్తూన్న గోపాలాన్ని తన యింట్లో వచ్చివుండమన్నాడు. ఇళ్లకు కరువైన ఈ రోజులలో 'ఇంతకన్నానా' అని గోపాలం తన తల్లి వెంకాయమ్మనీ, తమ్ముడు శేషగిరినీ, భార్య నరసమ్మనీ తీసుకుని మాధవరావు ఇంట్లో కాపురం వుండడానికి వచ్చాడు. ఒక్క వంటిల్లుమినహా తతిమ్మా క్రిందభాగమంతా వాళ్లకిచ్చివేశి మేడమీద తమరు వుండడానికి రాధ ఇష్టపడింది. వెంకాయమ్మగారు తనకి సహాయంగా వుంటారని రాధ సంతోషించింది. బజారు కెళ్లేపూచీ ఇకమీద శేషగిరి చూచుకుంటాడని మాధవరావు సంతోషించాడు.

రచన:
**శ్రీమతి యస్. రత్నమ్మ**

గోపాలం ఎంత ఘరానామనిషో శేషగిరి అంత తుంటరి. అబద్ధాల కోరూను. చదువు వంటబట్టలేదు. గోపాలం కొన్ని రోజులు ప్రయత్నంచేశి తనకు తెలిసిన చోట్ల నౌకరీ ఇప్పించాడు. కాని మూడో రోజుకల్లా పైవాళ్లలో దెబ్బలాడి చక్కా వచ్చేసేవాడు. దానితో ప్రాణం విసిగి ఏదైనా చిల్లరదుకాణం పెట్టుకోమని ఓ వందరూపాయలు ఇచ్చాడు. తలచెడ్డవాళ్లందరికీ అరువుబేరాలు పెట్టి మూడోనాటికి దివాలా తీశాడు. మాధవరావింటికి చేరుకునేనాటికి ఏ వ్యాపారం, ఏ ఉద్యోగం లేకుండా వేగబాండ్‌లాగ తిరుగుతున్నాడు. రాధకిమాత్రం ఏదైనా బజారుపని చేసిపెట్టుతూండేవాడు. అతని సంగతి పూర్తిగా తెలియక రాధ అతన్ని చూచి చాలా జాలిపడుతూండేది. ఇంచుమించు ఒక్క యీడువాళ్లగుటచే రాధ, నరసమ్మ చాలా కలసిమెలసి వుంటారు. తాను ఏ వస్తువు చేసినా అత్తచాటు కోడలని నరసమ్మకి పెట్టనిదే రాధ తినేదికాదు.

ఒకనాడు మాధవరావు సర్క్యూటువెళ్ళవలసి వచ్చింది. అంతకుమునుపే గోపాలం కూడా ఏదో పనిమీద వూరెళ్లాడు. అందునించి ప్రతీసారి రాధకి సాయం వెంకాయమ్మగారే పడుకుంటూన్నా యీసారి నరసమ్మని వెళ్లి పడుకోమంది అత్తగారు.

నరసమ్మ రాన ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ పదకొండుగంటల [illegible]



దాకా మేలుకుని వున్నారు. వేసవి ప్రారంభం అవడంనించి ఈ ఉక్కపోత ఎక్కువగా వుందని డాబామీద తలుపు తీసిపెట్టుకుని పడుకున్నారు. గదిలో నీలంబల్బు వెలుగుతూంది పన్నెండుగంట లయింది. అంతవరకూ మేలుకుని వుండడంనించి చల్లగాలి తిరగడంనించీ వా రిద్దరకూ గాఢంగా నిద్రపట్టింది

ఇంతలో దీపం ఆర్పిన చప్పుడవడమూ రాధకాలిమీద చల్లని చెయ్యిపడడమూ జరిగింది. మొదట మంచి నిద్రలో వుండడం చేత రాధ చాలా కంగారుపడింది. కాని, వెంటనే ధైర్యం తెచ్చుకుని 'ఎవరది' అని కేక వేసింది. నక్షత్రాల వెలుగు కొంచెం గదిలో పడడంనించి ఆ వచ్చిన మనిషిని గుర్తించి ఏం శేషగిరి ఎందు కిలాగ వచ్చావు అర్ధరాత్రి నా గదిలోకి ఎందుకు వచ్చావు, నీ కిక్కడ పనేముంది? దీపం ఎందుకు ఆర్పావు, పో కిందికి పో అని గద్దించింది.

"మరేం లేదు నేను - నేను- కింద ఏదో చప్పుడైతే భయమేసి మేడమీదికి వచ్చి మిమ్మల్ని లేపుదామని వచ్చాను. అంతే కాని మరే వుద్దేశం లేదు."

"బాగుంది తాడిచెట్టు ఎందు కెక్కావంటే దూడగడ్డికోసరం అన్నాట్ట నీలాంటి బుద్ధిమంతుడు, సేల్లాగుంది నీమాట. చాల్చాలు, నీ వేషమంతా నేను కనిపెట్టుతూనే వున్నాను. ఈమాటికి వూరుకున్నాను కాని, ఇలాగ ఇంకొకమారు జరిగితే మీ అన్నయ్యచేత చెప్పుదెబ్బలు కొట్టిస్తాను, జాగ్రత్త నాకు ఇంచి నీ వేమనుకుంటున్నావో! బుద్ధిగా మసులుకో, పో, కిందికి పోయి పడుకో," అని నాలుగు చివాట్లు వేసింది, శేషగిరి తలవంచుకుని క్రిందికి వెళ్ళిపోయాడు. తరువాత రాధ, నరసమ్మతో, "చూశావా, అక్కయ్యా! యీ దుర్మార్గుడు ఏమి చేసాడో, ఎంత ద్రోహం తలపెట్టాడో? నన్ను అల్లరిచిల్లరిదాన్ని అనుకున్నాడు కాబోలు!" అన్నది.

"అవునక్కా, వాడి వాలకం చూస్తే ఎప్పుడో ఇలాంటిపని చేస్తాడని నేనూ అనుకుంటూనే వున్నాను ఇంకొకమారు ఇట్లా చెయ్యకుండా బాగా చివాట్లేశావులే. నే నేమన్నా అందామంటే అత్తయ్య నామీద విరుచుకుపడతారని నేను అంతా చూస్తూ ఏమన్నా ఘోరానికి ఒడిగడితే అప్పుడే కలగచేసుకుందామని వూరుకున్నాను ఇవాళ నేను మావారితో చూచాయగా అంటే "ఆఁ పోనూ వాడు

అలాంటివాడు కాడు అని నామాట తోసి పారేశారు."

"పోదూ వాడేం చెయ్యగలడు? వాడి మొహం!"

"అలా గనకు. తాచుపాములాంటివాడు వాడిని నమ్మేందుకు లేదు."

దుస్వప్నంలాగు రాధ ఆవిషయం మరచిపోయింది.

* * *

'రేడియో' వాల్వు పాడైపోయినాయని 'రిపేర్' చెయ్యమని మాధవరావు చెప్పినట్లు ఒక యువకుడు కొన్ని పనిముట్లు తీసుకుని వచ్చాడు. రేడియో పడకగదిలో వుంది. "శేషగిరీ నీవు కాస్త దగ్గరవుండి బాగుచేయించమ్మా" అని రాధ అడిగింది.

"లేదు వదినా నాకు కొంచెం బజారుపని వుంది. నేను వచ్చేదాకా నీవు వుంటే తరువాత నేను వస్తాను."

"సరే' అయితే" అని రాధ ఆ కుర్రవాడిని మేడమీదికి రమ్మంది. పడకగదికి రెండుతలుపులు, రెండుకిటికీలు వున్నాయి. కిటికీలు తెరచియే వున్నాయి. ఒక తలుపు వేశివుంది. ఇంకొక తలుపు ప్రక్కగా గోడదగ్గరగా రేడియో వుంది. రేడియో పరీక్షచేయుటకు ఆ కుర్రవాడు ఒక తలుపు రెక్క చేరవేసి చూస్తూన్నాడు. పరాయి మనిషిని గదిలోపెట్టి తాను బయటకు వెళ్లిపోవడం జాగ్రత్త కాదని రాధ అక్కడనే కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరగవేస్తూంది. ఇంతలో కిటికీదగ్గర చప్పుడైంది. ఏమిటా అని రాధ తల ఎత్తి చూసేసరికి శేషగిరి తల ఎగరవేస్తూ విషపు నవ్వు నవ్వుతూ నిల్చున్నాడు. 'రా శేషగిరీ నీవు వస్తే నేను వెళ్లాలి. అని రాధ అంది.

'ఎందుకులే ఒదినా వూరికే వచ్చాను క్షమించు. నేనెందుకు' అని నవ్వేసి వెళ్లిపోయాడు. ఆ నవ్వుచూచి రాధమనస్సు కలుక్కుమంది.

* * *

ఆ రోజు తెల్లవారుఝామున మాధవరావు సర్క్యూటునుంచి వచ్చాడు. రాధకి అతనిని చూడగానే వూరంత సంతోషమైంది. గబగబ క్రిందికి వెళ్ళి పనిమనిషిని లేపి పాలవాడికి కబురుపంపించింది. పాలు వచ్చేలోగా 'ఉప్మా' చేసి సగ్గుబియ్యం వడియాలు వేయించింది. పాలు రాగానే కాఫీ చేసి 'కాఫీ టిఫిన్ రెడీ సార్' అని కేక వేసింది. 'తినడానికి మేము రెడీ సార్' అని అతను నవ్వుతూ కిందికి దిగివచ్చాడు.

"రాధా, కేంపునించి రాగానే నీ సుకుమార హస్తాలతో చేసిన ఈకాఫీ అమృతం చప్పరించేసరికి నే పడ్డ శ్రమంతా తీరిపోతుంది. ఇంటిముఖం కాగానే మా రాధ చేసిన పదార్థాలకోసరం నోరు వూరికే వూరుతుంది. వుప్మా ఎంతలో తయారు చేశావు? జీడిపప్పుకూడా వేశావే! నీవు ఇంకొంచెం వేసుకో."

"ఎదురుగుండా వున్నంతసేపే ఈకబుర్లు. ముఖం చాటుకాగానే నేను జ్ఞాపకమే వుండను."

"ఏమి చెయ్యమన్నావు, రాధా? నాకు మాత్రం నిన్ను వదలివెళ్ళడం సరదా అనుకున్నావా? నిన్ను వదలివెళ్ళడానికి నేనెంత 'ఫీలవు'తానో నీకుమాత్రం తెలియదూ?" అని గెడ్డం పట్టుకు బుజ్జగించాడు.

"పోనీండి,నన్నుకూడా సర్క్యూటుకు తీసుకెళ్లకూడదూ? మీ కన్నీ రుచిరుచిగా వేళపట్టున చేసిపెడతాను. అయినా ఈసారి నన్ను తీసుకెళ్ళకపోతే ఒప్పుకోనండీ," అని లోలాక్కులు ఆడిస్తూ మారాంచేసింది.

"సరే, నీవు నాతోవస్తే అడగక్కరలేదు. నీవుగాని మా ఇంజనీయరుగారి కళ్లపడ్డావంటే నిన్నో, నా ఉద్యోగమో నీళ్లు వదలుకోవలసినదే. నాకన్నా జూనియరులందరూ పైకి వచ్చి నేనింకా ఈ సబ్ ఓవర్ సీరులో పడివున్నాను."

"పోనిద్దురూ, మాటిమాటికీ అలా గనకండి, ఇప్పుడు మనకి లోపం ఏమిటండీ? హాయిగా రాజా రాణీలా గున్నాము," అని అంటూ 'పాన్' చుట్టి ఇచ్చింది.

"అన్నట్లు రాధా మన రేడియో బాగయిందా?"

"ఆ మొన్న నొక అబ్బాయి వచ్చి బాగుచేసి వెళ్లేడు."

"ఇదిగో చూడూ, నేను,శేషగిరి అలాగ బజారుకు వెళ్లివస్తాము. లేతవంకాయలు పంపిస్తాను. కమ్మగా ముద్వాంకాయకూర చేస్తావుగదూ?" అని బుగ్గమీద చిన్న చిటిక వేసి వెళ్లిపోయాడు.

"అబ్బ పోదురూ, మరీ చిన్నతనం ఎక్కువైపోతోంది. సరే చూడండి తొందరగా వస్తారా? దివ్యాన్నం దివ్యదర్శనమేనా?"

"ఆహో, రాణీగారి ఆజ్ఞాప్రకారం 10వ గంటకు హాజరు కాగలము."

బజారుకెళ్ళిన శేషగిరి మాధవరావులు ముందు లైబ్రరీకి వెళ్లేరు. ఇంకా లైబ్రేరియను రాకపోవుటచే తోటలో చెట్లనీడని ఒక బెంచీమీద కూర్చున్నారు.

"ఏమిటి విశేషాలు, శేషగిరీ? మీ అన్నయ్య ఎప్పుడు వస్తాడు?"

"ఏమోనండీ! మీరు, అన్నయ్య ఇంచుమించు ఒకసారే వెళ్లేరుగదూ. అన్నయ్యగారూ, మీరు ఇలాగ కేంపులు వెళ్లిపోతారు గదా, వదినమ్మకి కష్టంగా ఉండదూ?"

"తల అమ్ముకున్న తరువాత మనకి కష్టం అంటే తప్పుతుందా?"

"అవునులెండి అయినా ఇంట్లో ఎవరూ పెద్దవాళ్లు లేకపోవడం బాగలేదండీ."

"ఏం? మీ రంతా లేరా? సాయంగా వుంటారనేగా మిమ్మల్ని పెట్టుకున్నది?"

"అవునులెండి. కాని- మేము పరాయి వాళ్లం. ఏమన్నా అంటే ఎవ రేమనుకుంటారో అని భయపడుతాము. ఎందుకైనా మంచిది మీ అమ్మగారు వచ్చివుంటే బాగుంటుంది."

"వూళ్లో గంపంత సంసారం, ఇల్లూ, వాకిలీ, గొడ్డూ గోదా వదలిపెట్టి వాళ్లు ఎలాగ వస్తారు? ఇంతకీ ఏంజరిగిం దేమిటి?"

"అట్టే జరిగెందు కేముంది?"

"ఈవాళ కొత్తగా మాట్లాడుతున్నావు. నీ మాటలు వింటూంటే నా కేమిటోలాగుంది. ఏదో దాస్తూన్నట్లు మాట్లాడుతున్నావు."

"మరేమీ లేదుగాని రేడియో బాగు చేయడానికి మీరు వూర్లో వున్నప్పుడే రమ్మనలేకపోయారా?"

"ఏం? దానిలో తప్పేముంది?"

"అందులో తప్పేముందిలెండి. అసలు మనిషి తిన్ననైనవాళ్లయితే ఎవ రేమి చేయగలరు?" మన బంగారం మంచిదయితే కంసాలివాడు ఏం చేస్తాడు? అయినా నాకెందుకు లెండి."

"శేషగిరీ, నీమాటలు నా కర్థమవడం లేదు. నీవు చెప్పదలచుకున్న దేదో సరిగా చెప్పు."

"కొన్నాళ్లుపోతే మీకే తెలుస్తుంది. నా కెందు కొకళ్లసంగతి? ఎటునించి ఎటు ఒచ్చినా నేనే చెడ్డవాడిని. నేను చెప్పినా మీరు నమ్మరు."

"అలా గాదు, శేషగిరీ, విసిగించక సరిగా చెప్పమూ."

"నామీద మీకు కోపం వస్తుంది. మంచికిపోతే చెడ్డ వస్తుంది. మీ అపకీర్తి నా అపకీర్తి అనుకుని నా కళ్లతో చూచిన విషయం నా నోటితో చెప్పలేకుండా వున్నాను. క్షమించి నన్నిక అడక్కండి."

"చెప్పితేనేకాని వీలులేదు. చెప్పి తీరాలి."

"మరేమీ లేదు. మొన్నను మీరు వూరిలో లేనప్పుడు నీటుగా తయారై ఒక కుర్రవాడు వచ్చాడు. రేడియో బాగుచేస్తానన్నాడు. పరాయివాడుగదా నేను దగ్గర

వుండి బాగుచేయిస్తానంటే, వదినమ్మ నన్ను బజారుకు పంపి, తాను ఆ కుర్రాడు కలసి మేడమీదికి వెళ్లేరు. నేను తిరిగి వచ్చేసరికి మీ పడకగదితలుపులు వేసివున్నాయి. నాకు అనుమానం తోచి కిటికీదగ్గరకు వచ్చి చూచేవరకూ మీరూ నేనూ నమ్మలేని దృశ్యం నాకళ్లబడింది."

"ఆఁ ఆఁ నిజంగా? నారాధే? నా రాధ అలాగ చేస్తుందా? నేను నమ్మలేను, శేషగిరీ!"

"పోనీండి, నమ్మకండి. అదే మాకూ కావలసినది."

"అలా కాదు. ఇన్ని దినాలుగా నాతో కాపురం చేస్తూ నామీద అమితప్రేమ కల రాధ ఈమాదిరిగా సంచరించిందంటే నేను, నమ్మలేకుండా వున్నాను. అబ్బ! నా తల పగిలిపోతూంది. ఇంత ద్రోహమా? నన్ను నేనే నమ్మలేకుండా వున్నానే. ఛీ, ఛీ! పాడు లోకము. నాకు ఇప్పుడు ఏంచెయ్యడానికి తోచకుండా వున్నది. ఏబావిలోనో పడి ప్రాణాలు విడిచేస్తాను. అంతేకాని ఈ ఆ వేదన భరించలేకుండా వున్నాను."

అని రెండు చేతులతో తల పట్టుకుని కూర్చున్నాడు.

"మాడండీ అన్నయ్యగారూ, మీకన్న చిన్నవాడినేకాని నా దొక్క మనవి వినండి. ఈవాళ సాయంకాలం వదినెమ్మని పుట్టింటికి పంపించెయ్యండి, ఆమె యెదురుగా వుంటే ఏదో అఘాయిత్యం చెయ్యక మానరు. క్రమంగా మీ వుభయుల మనస్సు మార్పు కావచ్చును. మీ మనస్సు శాంతిగా వుంటుంది. మీ రింత గందరగోళం పడతారంటే చెప్పక నేపోదును."

"మాధవరావు మౌనం వహించాడు.

"ఇంటికి పదం అన్నగారూ, చాలా ఆలస్యమైంది." ఇద్దరూ ఇంటిముఖం పట్టారు.

ధుమధుమలాడుతూ వస్తూన్న భర్తను చూచి భయపడుతూ రాధ "ఏమండీ 10 గంటలకే వస్తానని ఇంత పొద్దు పోగొట్టేరు. తలంటి పోసుకొంటారేమో నని అన్నీ సిద్ధంచేశాను. రెండు ఝాము లయిపోయింది. స్నానం చేస్తారా?" అని అడిగింది.

"నా కేమీ అక్కర లేదు. నేను ఈపూట భోజనం చెయ్యను. నీవు అన్నం తిని పైకి రా. నీతో మాట్లాడాలి," అని గబగబ పైకి వెళ్లిపోయాడు.

"మీకు లేని ఆకలి. నాకుమాత్రం వుందా?" అని ఆ యిల్లాలు వంటింటితలుపు చేర వేశి మేడమీదికి వెళ్లింది. పడకగదిలో వా రిద్దరూ ఏమిఘర్షణపడ్డారో ఏమో కొంత సేపటికి, "సరే, నా యిలవేల్పు వెంకటరమణమూర్తికి ఆఖరుదండము పెట్టుకుని మరీ వెళ్లిపోతాను," అని రాధ అన్నమాటలు పైకి వినబడ్డాయి.

రాధ క్రిందికివచ్చి దేముడరుగుపై కూర్చుని దేవుడిధ్యానంలో మునిగిపోయింది.

ఇంతలో హూం-హూం అనే శబ్దం వినవచ్చింది. వీళ్ల వైఖరి కనిపెట్టుతూన్న నరసమ్మ వచ్చి చూచి, "అత్తయ్యా-అత్తయ్యా ఇలాగ తొందరగా రాండి." అని కేక వేసింది. వెంకాయమ్మగారు వచ్చి చూసేసరికి రాధ వూగుతూ శివాలు వేస్తూంది. "ఇంత కావరమా? నే నెవ రనుకున్నారు? చూడండి మిమ్మ ల్నేం చేస్తానో? వంశనాశనం చేస్తాను. హూం! నేను ఏడుకొండలవాడిని. నే నెవరో కన్నుగానఖండా వున్నారా? నన్నే నమ్ముకున్న భక్తుల కపకారం తలపెట్టినవారిని సర్వనాశనం చేసితీరుతాను. ఏడీ ఆ ఖండాలుడు ఏడీ? పతివ్రత, నా భక్తురాలు, దానిమీద లేనిపోని మాటలు చెప్పి కాపురాలు కూలదోస్తాడా? రేపీపాటికి వాడి గతేమవుతుందో చూచుకోండి. పిలవండీ ఆ శేషగిరిని: ఏమిరా నీవు చేసిన తప్పు వొప్పుకో. హుం! వప్పుకుంటావా, లేదా? నీకు లొంగలేదని లేనిపోని మాటలు చెప్పి నమ్మిస్తావా? జరిగిన సంగతి చెప్పు, అబద్ధం చెప్తే గొంతు నులిమేస్తాను. నీబోటి పాపాత్ములపాలిటి యము డున్నాడని తెలియ దేం? పండువంటి కాపురం పడదోయా లనుకున్నావా? దుర్మార్గుడా! కాళ్లు పట్టుకుని తప్పయిందని లెంపలు వేసుకో!" అని గద్దించేసరికి శేషగిరి గడగడ వణకుతూ పోయి రాధకాళ్లు పట్టుకుని, "తల్లీ, అపరాధం అయింది. క్షమించు! యథార్థం అందరిముందు చెప్పేస్తాను. రక్షించు, తల్లీ. ఎరుగక చేసిన తప్పు. మన్నించు తల్లీ!" అని కాళ్లమీద పడి లెంపలేసుకుని ఆమెపట్ల తాను చేసిన ద్రోహమంతా చెప్పాడు.

"ఇకనైనా బుద్ధొచ్చిందా? ఇక పతివ్రతల జోలికి వెళ్లవుగదా?" అనిన్నీ, మాధవరావుని, "పతివ్రత అయిన నీ భార్యశీలాన్ని ఎన్నడూ శంకించకూ," అనిన్నీ రెట్టించిరెట్టించి అడుగుతూండగా వెంకాయమ్మగారు ఇంత కర్పూరం తెచ్చి హారతిచ్చారు. నరసమ్మ సాంబ్రాణిధూపం వేసి తడిచేత్తో రాధకళ్లు తుడిచింది. రాధ విరుచుకుని వెనకకు పడిపోయింది. ఈ హడావుడిలో మొగం చెల్లక సిగ్గుతో శేషగిరి చల్లగా జారుకున్నాడు. కొంతసేపటికి రాధకి వళ్లు తెలిసింది. శోష వచ్చి పడిపోయినట్లు నాలిక పైకి పెట్టి, దాహమని సౌంజ్ఞచేశింది. నరసమ్మ కొంచెం చల్లటి నీళ్లు తీసుకొచ్చి గొంతుకలో పోయగానే తెప్పరిల్లి కళ్లువిప్పి చూచి తాను భర్తవొళ్లో పడుకునివుండడం గ్రహించి మెల్లగా లేవ ప్రయత్నించింది.

"లేవకు, రాధా, లేవకు, ఇంకా నీరసంగా వున్నావు. పవిత్రమైన నీ శీలాన్ని శంకించిన పాపాత్ముడిని క్షమించు. నీ నిర్దోషిత్వాన్ని సాక్షాత్ భగవంతుడే నిరూపించాడు. నా మనోదుర్బలత్వానికి నాకే సిగ్గవుతోంది," అని క్షమార్పణ కోరుకున్నాడు.

ఆనాటి రాత్రి వెంకాయమ్మగారే వారుభయులకు భోజనం పెట్టారు. ఇద్దరూ భోజనాలు కాగానే యథాప్రకారం పడకగది ప్రవేశించారు. నాటికి నేటికీ శేషగిరి పత్తాయే లేదు. ఇంత గందరగోళానికి బాధ్యు లెవరు? దుర్మార్గుడు అని తెల్సికొనకుండా అనువిచ్చిన రాధా? దుష్టుడైన శేషగిరా? ఇన్ని దినాలుగా కాపురం చేస్తూ భార్యస్వభావం గుర్తెరుగని మాధవరావా?


శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము : వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

ఆంధ్రగ్రంథమాల.